# చిలిపి కిరణం

"అయిదడుగుల ఒకంగుళం ఉంటేనేగాని నేను వచ్చి చూడను!"

ఆ హాల్లో సూదిపడ్డా వినబడేటంత నిశ్శబ్దమేర్పడింది ఆ మాటలకు. అందరి చూపులూ అతడి మీదకే తీక్షణంగా సూదుల్లా గురిపెట్టి వున్నాయి.

అతడి మాటలు వాళ్ళ ముఖాల మీద చాచి కొట్టినట్లుగా వున్నాయి.

రామచంద్రం అసహనంగా అటూ యిటూ కదిలాడు. ఆ తరువాత చలపతి టీపాయ్ మీద వున్న మంచినీళ్ళ గ్లాసును అందుకుని గడగడా నీళ్ళు త్రాగేశాడు.

పిల్లవాడి తండ్రి ఏడ్వలేక నవ్వినట్లుగా ఓ నవ్వు నవ్వాడు.

"పోనీలేండి... పోనీలేండి... చూడు చలపతీ... మన సుబ్రహ్మణ్యం లేడూ... అదే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నాడే... ఆం... వాడు... వాడికో కొడుకున్నాడురా... వాడు బి.హెచ్.ఇ.ఎల్లోనో, బి.డి.ఎల్లోనో తెలియదుగాని యింజనీరుగా పనిచేస్తున్నాడు... వీరిని వాళ్ళింటికి తీసుకువెళ్ళి కదిలించగూడదూ!"

ఆయన కంఠం కొడుకు మాట్లాడిన తీరుకు క్షమించమన్నట్లుగా వున్నది. ఆయన మొహం చదువుకున్న కొడుకు అంత అమర్యాదగా మాట్లాడినందుకు వ్యథ చెందుతున్నట్లుగా వడలి వున్నది. ఆయన కళ్ళు పెద్ద ఉద్యోగంలో వున్న ఒక్కగానొక్క కొడుకు పొగరుమోతు తనాన్ని చూడలేనట్లుగా మూతలు పడుతున్నాయి.

రామచంద్రంకు జాలివేసింది ఆయన పరిస్థితి చూస్తుంటే. తనంటే ఆడపిల్ల తండ్రిగా ఇలాంటి వాళ్ళను నూటొక్క మందిని చూచి వుంటాడు. కనుక తను అతడి మాటలకు ఓ క్షణం బాధపడ్డా మరుక్షణంలోనే కోలుకొని ఓ జీవంలేని నవ్వు నవ్వేసి వూరుకున్నాడు.

ఇక మధ్యవర్తిగా వచ్చిన అతడి మిత్రుడు చలపతయితే అవమానంతో ముఖానికి గంటుపెట్టుకు కూర్చున్నాడు. "అనవసరంగా పెద్దమనిషి రామచంద్రాన్ని తీసుకొచ్చి మనస్సు నొచ్చుకునేలాచేశాను" అనుకుంటూ బాధపడసాగాడు.

పిల్లవాడి తండ్రి చలపతికి దూరపు బంధువు. అందుకే మిత్రుడు రామచంద్రం, "మా అమ్మాయికి ఏదైనా మంచి సంబంధం చెప్పవయ్యా బాబూ... ఎమ్మే చదివింది... కంప్యూటర్స్‌లో- ఏదో కోర్సు- నాకు తెలిసిచావదులే- చదివింది... వాళ్ళు కావాలనుకుంటే ఉద్యోగం చేస్తుంది... పచ్చటి పసిమి... బంగారు బొమ్మలా వుంటుంది... మా అమ్మాయి అని గాదుగాని- వంట బహు రుచిగా చేస్తుంది... కట్న కానుకల్లో లోపం చేయను... అన్నీ బాగున్నాయి గాని.... ఒక్కటే యిబ్బందిగా వున్నదయ్యా!" అని ఆగాడు ఒక్క క్షణం.

"ఏమిటేం అది?"

"కాస్త పొట్టయ్యా... అయిదుకు మించి లేదు... నేనెక్కడకు వెళ్ళినా పొడుగు వాళ్ళే తగులుతున్నారు. సరి జోడి కనబడటం లేదు!" అన్నాడు దిగులుగా రామచంద్రం.

"రాసిపెట్టివుంటే రంభలాగా కనబడతారని... అదేం ఫరవాలేదయ్యా... పద... మా బంధువొకడున్నాడు ... వాడికో కొడుకుండాలి... మంచి కుటుంబం... మాట్లాడి వద్దాం!... మల్కాజిగిరిలో వుంటారువాళ్ళు..." అంటూ తీసుకువచ్చాడు ఆ ఉదయాన.

ఇంకా పది కాలేదు. ఆదివారం. లోపల చల్లగా వున్నది. బయట అప్పుడే పైకి లేస్తున్న సూర్యుడు తన జూలు విదిలించటానికి రెడీ అవుతున్నాడు.

"నువ్వు చెప్పిన వాళ్ళ అడ్రసివ్వు... రామచంద్రాన్ని తీసుకు వెళతాను!" అన్నాడు పిల్లవాడి తండ్రితో చలపతి.

కాఫీలు వచ్చినయి.

కాఫీ తెచ్చిన అమ్మాయికి యిరవయ్యేళ్ళుంటాయి. కాస్త నల్లగా వున్నది. అయినా ముఖం కళగా వున్నది. కట్టుకున్న మాసిన బట్టలమీద ఎవరి చూపులూ నిలబడకుండా తనవైపుకు లాక్కునే కళ్ళు విశాలంగా సూదంటు రాళ్ళలా వున్నాయి. చెవులకు పెట్టుకున్న జూకాలు పాతకాలం ఫ్యాషనే అయినా ఆ అమ్మాయి ముఖానికి నప్పినట్లుగా వున్నాయి. పెట్టుకున్న పొడుగాటి కుంకుమబొట్టు దీపంలా వెలుగుతున్నది. కాఫీ యిస్తున్నప్పుడు ఆ అమ్మాయి పెదవుల మీద పరుచుకున్న చిరునవ్వు ఎండాకాలంనాటి వెన్నెల్లా వున్నది.

రామచంద్రం కాఫీ కప్పు అందుకున్నాడు.

చలపతి ముఖంలో కోపం ఇంకా చల్లారలేదు. ఎప్పుడూ చలాకీగా మాట్లాడుతుండే అతడు ముభావంగా ముళ్ళ మీద కూర్చున్నట్లుగా కూర్చున్నాడు. ఏదో తప్పు చేసినట్లుగా రామచంద్రం ముఖంలోకి చూడలేనట్లుగా తల వంచుకు కూర్చున్నాడు.

కాఫీ త్రాగటం అయింతరువాత చలపతే ముందు లేచాడు. వెనక రామచంద్రం లేచాడు.

అందరూ బయటకు వచ్చారు.

వాళ్ళ యింటి గేటు దాటి రోడ్డెక్కి పదడుగులు వేసింతరువాత చలపతే మొదటి సారిగా నోరు విప్పి నిప్పులు కురిపించాడు. "వాడికి ఈ జన్మలో పెళ్ళికాదు!" అంటూ.

రామచంద్రం నవ్వేశాడు. "పోనీయ్‌లే... అనవసరంగా మనం నోరు జారటం దేనికి... ఎవరి కోరికలు వాళ్ళవి... ఎవరి తరహా వాళ్ళది... పాపం ముసలాయన చాలా బాధ పడుతున్నట్లనిపించింది!"

"ఎందుకు బాధపడటం... అలా వాడిని పెంచినందుకు సిగ్గు పడాలిగాని... వెధవ... వెధవన్నర వెధవ అని... చదువుకున్నదెందుకు?... అయిదడుగుల ఒక అంగుళం కావాలిట... చెప్పానుగదా అయిదడుగులు వుంటుందని... అంటే ఏదో వంకతో మనని వెళ్ళగొట్టాలని... దేనితోనన్నా ప్రేమలో పడ్డాడేమో వెధవ..."

"అయినా అయి వుండవచ్చు!"

"పెద్దవాళ్ళతో ఆ ఏడ్పేదో ఏడ్చి పెళ్ళిచేసుకు చావవచ్చు గదా... కుంటికూతలు కూయడం దేనికి... మనలాంటి వాళ్ళను యింటిచుట్టూ తిప్పుకోవడం దేనికి... దేనికయినా మర్యాద వుంటుంది... అసలు నాకు తెలియక అడుగుతాను- అయిదడుగులకీ, అయిదడుగుల ఒకంగుళానికీ తేడా ఏమిటి?"

"మర్చిపో... వాళ్ళిష్టం వాళ్ళది... నువ్వన్నట్లుగా... రాసిపెట్టి లేదూ అనుకుందాం!"

"అంతేలే... అంతకు మించి మనం చేసేదేమున్నదిగాని... మాట, మంచి గురించే నలుగురూ అనుకునేది!"

"అవును, చలపతీ... ఇందాక మనకు కాఫీలిచ్చిన అమ్మాయిని చూచావూ... పనిమనిషిలా లేదు... చక్కగా వున్నది... బంధువుల అమ్మాయా?"

చలపతి నవ్వాడు. "రాజ్యమా? వాళ్ళకు దూరపు బంధువేలే... నా అనే వాళ్ళు లేకపోతే చిన్నప్పుడే వీళ్ళింట్లో తెచ్చి పెట్టుకున్నారు వీళ్ళకు సాయంగా వుంటుందని... అందునా ఆయన భార్య సంవత్సరానికి పన్నెండు నెలలు ఏదో వంకతో మూలుగుతునే వుంటుంది!"

✣ ✣ ✣

రాజ్యం తల విదిలించింది.

"ఛ! వీడేం మనిషి... వచ్చిన సంబంధమల్లా ఏదో వంకబెట్టి చెడగొడుతున్నాడు... వీడికి పెళ్ళయ్యేనా... నేను బ్రతికుండగా చూస్తానా?" రాధమ్మ మంచం మీద అటునుంచి ఇటు తిరిగి, ఒక మూలుగు మూలిగి, కళ్ళనీళ్ళు పెట్టుకున్నది- గచ్చును తడి గుడ్డతో తుడుస్తున్న రాజ్యాన్ని చూస్తూ.

తండ్రి చంద్రశేఖరం లోపలకు వస్తూనే, "మనిషికి చదువు, ఉద్యోగం ఒక్కటే కాదు... ఇంత లోకజ్ఞానం, మంచి మర్యాద గూడా వుండాలి!" అరవటం మొదలుపెట్టాడు.

"అయితే నేను అమర్యాదగా మాట్లాడానంటారా?" విసురుగా వచ్చాడు మూర్తి తండ్రి వెనగ్గా.

"కాక... ఏమిట్రా నువ్వు చూపించిన మర్యాద... అదేనా మాట్లాడే తీరు... ఒకళ్ళొస్తే బంగారు రంగులో వున్న అమ్మాయి కావాలంటావా?... నువ్వేదో ఎర్రగా మెరిసి పోతున్నట్లు... ఇంకొకళ్ళొస్తే గవర్నమెంటు ఉద్యోగం చేస్తే తప్పా చూడనంటావ్- నువ్వేదో పెద్ద గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నట్లు... మరొకరికేమో పోస్టు గ్రాడ్యుయేట్ అయితే గాని చూడనంటావ్... నువ్వేమో బి.కాం గట్టెక్కటానికి మూడేళ్ళు పట్టింది!"

"నాకు కావాల్సినవి చెప్పాను!"

"ఇట్లా అయితే నీకు చస్తే పెళ్ళి కాదు!"

"పీడా పోయింది!"

రాధమ్మ ఏడుపు పెద్దదయింది. రాజ్యం వాళ్ళ మధ్య వుండటం యిష్టం లేదన్నట్లుగా వంట యింట్లోకి వెళ్ళి పోయింది.

"నేను ముందే చెప్పాను- కాస్త మర్యాద నేర్చుకోరా అని... వాళ్ళను వివరాలు చెప్పనీయ్... జాతకం తీసుకుందాం... మనం అన్నీచూద్దాం... మనకు నచ్చని పక్షంలో జాతకం కుదర్లేదని మర్యాదగా చెబుదాం... ఇలాంటి విషయాలల్లో మననెవ్వరూ ఒత్తిడి చేయరు గదా!"

"మనిషి వెనకాలొకటి... ముందొకటి మాట్లాడే తరహా కాదు నాది!" విసురుగా బయటకు వెళ్ళిపోయాడు మూర్తి.

"అఘోరించు!" చంద్రశేఖరం కసిగా అని బాత్‌రూంలోకి వెళ్ళిపోయాడు స్నానం చేసేటందుకు గాను.

✣ ✣ ✣

ఆరు నెలల తరువాత-

చలపతి రామచంద్రాన్ని తీసుకొని చిక్కడపల్లి వచ్చాడు- అతడి మిత్రుడొకడు అక్కడ ఓ కుర్రాడు పెళ్ళికున్నాడు అంటూ అడ్రసిస్తే.

పది గంటలయింది. ఆకాశాన మబ్బులు అట్టముక్కలు అంటించినట్లుగా అక్కడొకటి ఇక్కడొకటి... ఎండ ఎక్కువ లేకపోయినా చిటపటలాడుతోంది చికాకు పుట్టిస్తూ. కాగితం మీద ఆ యింటి గుర్తులు ఎంతో వివరంగా వున్నా పట్టుకోవటం యిబ్బందేమో అన్నట్లుగా మెయిన్ రోడ్డు మీదే దిగారు ఆటోను యిద్దరూ.

కామేశ్వరరావుగారి యిల్లు కావాలి. ఆయన బ్రతికుండగా ఎలక్ట్రిసిటీ బోర్డులో పనిచేశారట... ముగ్గురు కొడుకులు... పెద్దవాడే పెళ్ళికొడుకు... ప్రయివేటు కంపెనీలో మార్కెటింగ్‌లో వున్నాడు... ఎప్పుడూ ఊళ్ళ మీద తిరుగుతుంటాడట... ఇవీ దొరికిన వివరాలు అని చెప్పాడట చలపతి మిత్రుడు.

చలపతి, రామచంద్రం నాలుగురోడ్లు తిరిగారు. హైదరాబాద్‌లో మనకు కావాల్సిన యిల్లు తప్పా అన్నీ తేలిగ్గా దొరుకుతాయి. వాళ్ళ యిల్లు దొరకడంతో సంబంధమే కుదిరినంత సంబరమయింది. వాళ్ళు పై వాటాలో వున్నారు.

యిద్దరూ కాళ్ళీడ్చుకుంటూ మెట్లెక్కారు. తలుపులు వేసుంటే కాలింగ్ బెల్ నొక్కారు.

పక్కగా వున్న కిటికీ తలుపు తెరుచుకున్నది.

“ఎవరు కావాలండీ?” ఓ పెద్దామె బయటకు చూస్తూ అడిగింది. అరవైపైనే వుంటుంది వయస్సు. బహుశః కామేశ్వరరావుగారి భార్య అయివుండవచ్చు.

“మేము...” నీళ్లు నములుతున్నాడు చలపతి. తలుపు తీయని ఆమెతో ఆ విషయం ఎలా కదపాలా అన్నట్లుగా ఒక్క క్షణం ఆగాడు.

“ఏం కావాలి మీకు?” తిరిగి ఆమే ప్రశ్నించింది.

ఆమె మాటతీరు వాళ్ళను కాస్త కలవరపరిచింది. చలపతి నోరు తెరిచాడు... “మీ అబ్బాయి వివాహానికి వున్నట్లుగా తెలిసి వచ్చామండి!”

“మీ అమ్మాయా?”

“కాదు... మా మిత్రుడు రామచంద్రంగారి అమ్మాయి!”

“ఏం చేస్తున్నది అమ్మాయి?”

లోపలకు ఆహ్వానించకుండానే ప్రశ్నలను తుపాకీ గుండ్లలా వదులుతున్న ఆమె మాటతీరు చికాకు వేసింది వాళ్ళకు.

"ఏం చేయటం లేదండి!" కాస్త కరుకుగానే సమాధానమిచ్చాడు చలపతి. "ఎమ్మే చేసింది- అంతే!"

"మా అబ్బాయికి ఇప్పుడు పెళ్ళిచేయమండి!" కిటికీ తలుపులు చటుక్కున- వాళ్ళ ముఖాన చాచి కొట్టినట్లుగా- మూసుకు పోయాయి.

అంత వయస్సున్న ఆమె అంత అసహ్యాకరంగా ప్రవర్తిస్తుందని ఊహించని వాళ్ళు బొమ్మల్లా నిలబడిపోయారు ఆ మెట్లదగ్గరే!

చిన్న పిల్ల గాదు... ముగ్గురు పిల్లల తల్లి... ఓ పెద్ద ఉద్యోగి భార్య... కొడుక్కు పెళ్ళి సంబంధం కోసం వచ్చిన వాళ్ళతో ఆమె మాట్లాడిన తీరు వాళ్ళిద్దరినీ అవాక్కే చేసింది.

మనమూ, మన సమాజమూ ఎక్కడికి వెళుతున్నాం?

నీరసంగా ఇద్దరూ మెట్లుదిగి క్రిందకు వచ్చారు. ఆ సందు దాటి మెయిన్ రోడ్డెక్కారు.

"ముందు కాఫీ త్రాగుదాం పద!" తలంతా నాజుగా వుంటే రామచంద్రం అన్నాడు.

యిద్దరూ ఎదురుగ్గా ఉన్న ఉడిపి హోటల్ మెట్లెక్కుతుండగా చంద్రశేఖరం కనబడ్డాడు.

"ఏమిటి... ఇలా చాలా దూరం వచ్చారు?"

"ఏముంది... వేటకు!" అన్నాడు చలపతి నవ్వి.

ఆయన గతం గుర్తుకు వచ్చినవాడిలా ముఖం ఇబ్బందిగా పెట్టి, "అహాఁ... అలాగా!" అంటూ యిద్దరి వంకా తెచ్చిపెట్టుకున్న నవ్వు పారేసి, అక్కడనుండి వడివడిగా వెళ్ళిపోయాడు ఏదో పని వున్నవాడిలా.

రామచంద్రంకు మొదట్లో ఆయన ఎవరో గుర్తుకురాలేదు. గుర్తుకురాగానే, "వాళ్ళబ్బాయే గదూ అయిదడుగుల ఒకంగుళం అమ్మాయి కావాలన్నది... ఇంతకీ దొరికిందా?" అన్నాడు నవ్వి.

"ఉఁహూఁ... జన్మలో వాడికిక పెళ్ళికాదు!"

"అదేం?"



— పి. ఎస్. నారాయణ

"మొన్నీమధ్యనే తెలిసింది నాకు... ఆ వీధిలో అంతా వాడి గురించే చెప్పుకుంటున్నారట. మనిషిలో మగతనం లేదట... అందుకే పెళ్ళి చేసుకొని అభాసు అయ్యేదానికంటే అసలు చేసుకోకుండా వుండటమే ఉత్తమమని- ఏదో వంకతో వచ్చిన సంబంధాలన్నీ తిరగగొడుతున్నాడట... అదే నయంలే... పెళ్ళిచేసుకొని ఆ పిల్లదాన్ని నరకంలోకి తోసేదానికంటే... వాడి చావేదో వాడు చావటం మేలుగదా!"

యిద్దరూ లోపలకు పోయి కూర్చొని రెండు కాఫీలు తెమ్మని చెప్పి మంచినీళ్ళు తాగారు.

"పాపం! ఇవ్వాళ చూసిన ఆమె కొడుకు గతేమిటో?" అన్నాడు రామచంద్రం.

"ఏముంది... చేసుకోడు అనటం లేదు గదా ఆమె... చేయను అంటున్నది... అంటే వాడిని తన మంచంకోడుకు గొలుసేసి కట్టేసిందన్నమాట... ఒకవేళ అన్నీ కలిసొచ్చి వాడికి ఆమె పెళ్ళి చేసినా అ వచ్చే పిల్ల గతి హరహరా... గోవిందా!"

* * *

సరిగ్గా అదే సమయంలో-

చంద్రశేఖరం ఇంట్లో-

మూర్తి- మేడమీద గుడ్డలారేస్తున్న రాజ్యాన్ని నిలవేశాడు.

"నువ్వు నమ్ముతున్నావా ఆ విషయాన్ని?" చికాగ్గా అడిగాడు.

"ఏ విషయాన్ని?" ఓరగా చూస్తూ నవ్వి అన్నది రాజ్యం.

"అదే... " తడబడ్డాడు. "నా గురించి నలుగురూ అనుకుంటున్న విషయాన్ని!" విసురుగా అన్నాడు ఉక్రోషంతో.

"ఏమనుకుంటున్నారేం?"

"నువ్వు వినలేదా?"

"ఈ నాలుగు గోడల నడుమనుండి నేనెప్పుడైనా బయటకు వెళ్ళటం నువ్వు చూచావా?... ఇంట్లో వంటచేయటం... మిగతా సమయాల్లో మీ అమ్మకు సేవచేయటం తప్ప నాకు ఇంకేమైనా తెలుసా?... అలాంటి నాకు బయట విషయాలెలా తెలుస్తయి!" అన్నది గొంతు కొద్దిగా పెంచి.

"ఊఁ... చిన్నగా మాట్లాడు... నలుగురూ వినేను మన మాటలు!" ఒక్కక్షణం ఆగాడు. బాధతోనూ, భయంతోనూ ఆమె వంకే చూస్తూ, "నేను మగవాడిని కాదట... నేను పెళ్ళికి పనికిరానట!" దిగులుగా అన్నాడు మూర్తి.

మరుక్షణంలోనే అతడి ముఖం కందగడ్డలా అయింది. కోపంతో నరాలు ఉబికి ఎర్రబడినయి.

అతడి కోపపు జ్వాలల్లోకి కట్టెలు ఎగదోస్తున్నట్లుగా, "నాకు తెలియక అడుగుతాను... వాళ్ళందరికీ ఎలా తెలిసిందట నీ సంగతి?" అన్నది.

ముక్కుల్లోనుంచి వేడిగాలి చిమ్ముతూ, "అదే నాకూ తెలియటం లేదు!" అన్నాడు మూర్తి కరుకుగా.

తిరిగి కాలుతున్న కట్టెల మీద నెయ్యి పోస్తున్నట్లుగా, "అంటే- వాళ్ళనుకుంటున్నది నిజమేనంటావు!" అన్నది కిసుక్కున నవ్వి.

బిత్తరపోయాడు ఒక్క క్షణం ఆమె మాటలకు మూర్తి.

"నువ్వూ నమ్ముతున్నావా వాళ్ళ మాటలను?"

"నిప్పులేందే పొగరాదంటారు... మరి ఏమో నాకేం తెలుస్తుంది!" నిర్లక్ష్యంగా అని వెనక్కు తిరిగి చేతిలోని తడి తువ్వాలను విడదీసి ఒక్క విసురు విసిరింది- తడి ఆరుస్తున్నట్లుగా.

మూర్తి కసిగా ఓ అడుగు ముందుకు వేశాడు. "ఏం అన్నావ్... మళ్ళీ అను!"

రాజ్యం తల ఎగరేసింది. "ఎవరు ఏమనుకుంటున్నారో నాకయితే తెలియదు... ఇప్పుడు నువ్వు చెప్పేటంత వరకూ జనం అలా అనుకుంటున్నారనే విషయం కూడా తెలియదు... నిజమే... నువ్వు వచ్చిన సంబంధాలన్నిటినీ పిచ్చి పిచ్చి వంకలతో చెడగొట్టటం- ఊళ్ళో వాళ్ళు అలా అంటున్నారని నువ్వనడం... వాళ్ళ మాటలు నిజమేనేమో అనే అనుమానాన్ని ఇప్పుడు నాలోనూ రేకెత్తిస్తున్నాయి!"

విసురుగా, కోపాన్ని నిగ్రహించుకోలేనట్లుగా, ఆమె మెడమీద చేయివేశాడు మూర్తి. "ఇంట్లో వాళ్ళ మాటలే ఇలా వుంటే... లోకులు ఎన్నయినా అంటారు!"

ఆమె మెడ మీద పడిన అతడి చేతిని ఎడం చేత్తో నెట్టేసింది బలంగా.

"ఎందుకు అంత ఆవేశం... బజారు వాళ్ళ మాటలు నిజం కాదని నిరూపించుకోవలసిన బాధ్యత నీ మీద ఉన్నది ఇప్పుడు!"

అతడు చటుక్కున, ఏదో పూనకం వచ్చిన వాడిలా ఆమెను పట్టుకున్నాడు. మీదకు లాక్కుంటూ, ఆమె గొంతెత్తి అరవబోయేలోగానే ఆమె నోటి మీద చేయివేసి నొక్కుతూ, "అది నిజంకాదని ఇప్పుడే నిరూపిస్తాను!" అన్నాడు.

✣ ✣ ✣

సరిగ్గా నెలరోజులకు-

ఒక శుభముహూర్తాన-

మూర్తి రాజ్యం మెడలో మంగళసూత్రం కడుతున్నప్పుడు-

గుండెల మీదగా వ్రేలాడుతున్న మంగళసూత్రాన్ని క్రిందకు జారకుండా నొక్కిపట్టుకున్న రాజ్యం... 'ఈ చాదస్తపు మొగుడు బస్తీలో ఆ పుకార్లను తనే లేపిందనే నిజం తెలుసుకుంటే, కడుతున్న మంగళసూత్రాన్ని త్రెంచివేయడు గదా?' అని మనస్సులోనే అనుకుంటూ లీలగా భయపడింది.

మరుక్షణంలోనే కోలుకుంటున్నట్లుగా తల ఎగరవేసి హేలగా నవ్వుకున్నది!

*(రచన: జులై, 1997)*